క్లుప్తంగా

నేడు శ్రీగిరిక్షేత్రానికి పీఠాధిపతుల రాక

జడ్చర్ల టౌన్: హిమాలయం ఉత్తరకాశి నుంచి 40మంది పీఠాధిపతులు మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలోని శ్రీగిరిక్షేత్రానికి గురువారం సాయంత్రం 4గంటలకు రానున్నట్లు ఆచార్య కృష్ణస్వామి తెలిపారు. బ్రహ్మావారులైన సాధుమహాత్ములు దక్షిణ భారతదేశ యాత్రలో భాగంగా ధనుర్మాసం పురస్కరించుకుని పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా శ్రీశైలం నుంచి యాదగిరిగుట్ట వెళ్తూ మార్గమధ్యలో ఆశ్రమానికి వస్తున్నారని పేర్కొన్నారు. భక్తులు హాజరై ఆశీర్వాదం పొందాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



జడ్చర్ల టౌన్: మండలంలోని మాటుబండతండా పంచాయతీలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం సర్పంచ్ దీపక్ రాథోడ్, భక్తులు భూమి పూజ చేశారు. గొల్లోనిదొడ్డితండా, మబ్బుగుండుతండా, మాటుబండ తండాకు ఆలయం అనుకూలంగా మారనుంది. ఆలయ నిర్మాణం కోసం సొంత స్థలాన్ని దానం చేసిన సర్పంచ్‌ను గ్రామస్తులు సన్మానించారు.

విద్యుత్ కోతలతో ఇక్కట్లు

బాలానగర్: మండల కేంద్రంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి సమాచారం లేకుండానే స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని సుమారు 5 గంటలకు పైగా బుధవారం కరెంట్ కోతలు విధించారు. సమాచారం లేకుండా సింగల్‌ఫేజ్ విద్యుత్ కూడా నిలిపివేయడంతో మండల వాసులు, వ్యాపారులు ఇబ్బందులకు పద్దారు. ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా మండల కేంద్రంలో స్తంభాల ఏర్పాటుతో మంగళవారం పెండింగ్‌లో ఉన్న లైన్స్ ఏర్పాటు కారణంగా ఇబ్బంది ఏర్పడిందని పేర్కొన్నారు. ఇకపై ముందస్తు సమాచారంతోనే విద్యుత్ కోతలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

రాజాపూర్: మండలంలోని ఖానాపూర్‌లో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభం

పాలమూరు: జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హాజరయ్యారు. అక్కడే ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించండి

భూత్పూర్: వాహనదారులు తమ వాహనానికి ఉన్న పెండింగ్ చలాన్లను రాయితీపై చెల్లించాలని ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు.

రాజాపూర్: రాష్ట్రంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి జరిమానాలు ఎదుర్కొంటున్న వాహనదారులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ఎస్ఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బైక్‌లు, ఆటోలలపై 80శాతం, కార్లు, ట్రక్కులు ఇతర భారీ వాహనాలపై 60శాతం, ఆర్టీసీ డ్రైవర్‌లు, తోపుడు బండ్ల వారికి 90శాతం రాయితీని ప్రకటించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి రథోత్సవం



మరికల్: మండలంలోని జిన్నారంలో బుధవారం తెల్లవారుజామున ఆంజనేయస్వామి రథోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అఖండభజన కార్యక్రమాలను నిర్వహించి రథోత్సవ వేడుకలను నిర్వహించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

మక్తల్: జాతీ స్థాయి ఖోఖో పోటీలకు మక్తల్‌కు చెందిన విద్యార్థినులు అనిత, ఇందు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రఘువీర్‌నామోజీ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 28నుంచి 30వరకు తమిళనాడు తిరువార్‌లో జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొననున్నట్లు వారు తెలిపారు. వారిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, డీవైఎస్ఓ వెంకటేశ్‌శెట్టి, రాష్ట్ర ఖోఖో ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, అభినందించారు.

నేటి నుంచి 'ప్రజా పాలన'

- మొదటిరోజు 8 వార్డుల్లో కార్యక్రమం
- ఇంటింటికీ దరఖాస్తు ఫారాల పంపిణీ
- ఒక్కో వార్డుకు టీం లీడర్ నియామకం
- ఎక్కడికక్కడ ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు



మహబూబ్‌నగర్ 44వ వార్డులో దరఖాస్తు ఫారం అందజేస్తున్న కౌన్సిలర్ వేదవ్రత్



హన్వాడలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనుంజయగౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రజాపాలనలో భాగంగా ఈనెల 28న అభయహస్తం గ్యారంటీలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 6వ తేదీ వరకు కొనసాగనుంది. మొదటి రోజు స్థానిక మున్సిపల్ పరిధిలోని 1, 3, 5, 11, 19, 23, 44, 49వ వార్డులలో సభలు నిర్వహించనున్నారు. ఆరు పథకాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను మున్సిపల్ సిబ్బంది ఆయా వార్డులలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేశామని మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. పూర్తి వివరాలతో పాటు కావాల్సిన ధ్రువపత్రాల జిరాక్స్‌లను దరఖాస్తు ఫారానికి జత చేసి వచ్చే నెల 6వ తేదీ వరకు వార్డు అధికారులకు అందజేయాలన్నారు.

- ఒకటో వార్డు పరిధిలోని 1,460 మందికి గాను తిమ్మసానిపల్లి రెవెన్యూ వార్డు కార్యాలయంలో 15 కౌంటర్లను ఏర్పాటు చేశారు. అక్కడ ఏఎస్ఓ అబ్దుల్ సలీం అందుబాటులో ఉంటారు. 3వ వార్డు పరిధిలోని 1,325 మందికి గాను అప్పన్నపల్లి రెవెన్యూ వార్డు కార్యాలయంలో 13 కౌంటర్లను ఏర్పాటు చేశారు. అక్కడ బిల్‌కలెక్టర్ శంకర్ టీం లీడర్‌గా వ్యవహరిస్తారు. 5వ వార్డు పరిధిలోని 1,609 మందికి గాను ఎనుగొండ రెవెన్యూ వార్డు కార్యాలయంలో 16 కౌంటర్లను ఏర్పాటు చేశారు. బిల్ కలెక్టర్ చిన్ని కృష్ణ టీం లీడర్‌గా వ్యవహరిస్తారు. 11వ వార్డు పరిధిలోని 1,447 మందికి గాను పాత పాలమూరులోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో 14 కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీనికి జూనియర్ అసిస్టెంట్ జి.యాదయ్య టీం లీడర్‌గా వ్యవహరిస్తారు. 19వ వార్డు పరిధిలోని 1,566 మందికి గాను షాషాబ్‌గుట్ట తండాలోని మహిళా కమ్యూనిటీ హాలులో 16 కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీనికి బిల్ కలెక్టర్ గోపాల్ టీం లీడర్‌గా వ్యవహరిస్తారు. 23వ వార్డు పరిధిలోని 1,365 మందికి గాను దోబీవాడలోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలులో 14 కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీనికి జూనియర్ అసిస్టెంట్ డి.రాజశ్రీ టీం లీడర్‌గా వ్యవహరిస్తారు. 44వ వార్డు పరిధిలోని 1,702 మందికి గాను బండ్లగేరి–దూద్‌ఖానా వద్ద ఉన్న మహిళా మండలి భవనంలో 17 కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీనికి బిల్‌కలెక్టర్ శివరాజ్ టీం లీడర్‌గా వ్యవహరిస్తారు. 49వ వార్డు పరిధిలోని 1,111 మందికి గాను రైల్వే స్టేషన్ సమీపంలోని పాత మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో 11 కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీనికి జూనియర్ అసిస్టెంట్ ఎస్.శేఖర్ టీం లీడర్‌గా వ్యవహరిస్తారు.

జడ్చర్ల టౌన్: మండలంలోని మాచారం, నసురుల్లాబాద్, పోలేపల్లి కిష్టారంలో గురువారం ప్రజాపాలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటి పరిధిలో కావేరమ్మపేట జీపీ ఫంక్షన్‌హాల్, బాదేపల్లి సాయిమందిరంలో ప్రజాపాలన సభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్ తెలియజేశారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు అధికారులు పిలుపునిచ్చారు.

చిన్నచింతకుంట: 28న మండలంలోని ఏదులాపూరం, ఉంద్యాల, చిన్నవడ్డేమాన్, చిన్నచింతకుంట, 29న పర్దిపురం, గోప్యానాయక్ తండా బండర్‌పల్లి, పల్లమరి, 30న లాల్‌కోట, నెల్లికొండి, 2న వడ్డేమాన్, దమగ్నాపూరం, 3న మద్దూర్, అల్లిపురం, అమ్మాపురం, గూడూర్, 4న సీతారాంపేట, కురుమూర్తి గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య పేర్కొన్నారు.

గండేడ్: ఆరుగ్యారంటీల అమలుపై గ్రామ సభలు ఏర్పాటు చేసేందుకు గురువారం నుంచి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులను టీంలుగా ఏర్పాటు చేసి వారిని అందుబాటులో ఉండి దరఖాస్తులను తీసుకోవాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రతి దరఖాస్తును స్వీకరించాలి..

హన్వాడ: మండల పరిషత్‌లోని సమావేశమందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీడీఓ ధనుంజయగౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన ప్రతి వినతిని స్వీకరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను స్వీకరిస్తూనే అర్జిదారులు తమ ఇతర సమస్యలపై కూడా దరఖాస్తులను ఇదే కార్యక్రమంలో సమర్పించడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 150 కౌంటర్లు, మూడు బృందాలు పని చేస్తున్నాయని ఎంపీడీఓ వివరించారు.

వైభవంగా ఆభరణాల ఊరేగింపు



అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం అయ్యప్పస్వామి తిరుఆభరణాల ఊరేగింపు వైభవంగా సాగింది. పద్మావతి కాలనీలోని దాచేపల్లి చంద్రయ్య గృహంలో ఉదయం ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల నామస్మరణల మధ్య తలపై పెట్టుకుని ఊరేగింపుగా గంగాపురం మార్గంలోని అయ్యప్పస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. విశేష అభిషేకం, అంతకుముందు ఆలయంలో అయ్యప్పసేవాసమితి ఆధ్వర్యంలో తెల్లవారుజామున సుప్రభాతసేవ, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఉదయం 7గంటలకు అష్టోత్తర శతనామార్చన, పుష్పార్చన చేశారు. ఊరేగింపు పురస్కరించుకుని అయ్యప్పభక్తులు భజనలు, కీర్తనలు చేస్తూ ముందుకు సాగారు. ఆభరణాలను ఆలయానికి చేర్చిన తర్వాత వాటిని స్వామికి అలంకరించి మహా మంగళహరతి నివేదించారు. రాత్రి 7గంటలకు మహాపడిపూజ నిర్వహించి భక్తులకు అల్పాహారం వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో కాళికాదేవి రథోత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని రామచంద్రాపూర్ ఊరగుట్టపై వెలసిన కాళికాదేవి రథోత్సవం బుధవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు గుట్టపై నుంచి అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగింపుగా దిగువనున్న తేరుమైదానానికి తీసుకువచ్చారు. అనంతరం రథంపై అమ్మవారి చిత్ర పటాన్ని ఉంచి రథోత్సవాన్ని చేపట్టారు. ముందుగా రథం ముందు కుంభంపోశారు.

ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారి బోనాలు నిర్వహించనున్నారు. ఇందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రజల సమక్షంలోనే పథకాల అమలు



అడ్డాకులలో చెక్కులను పంపిణీ చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

అడ్డాకుల: ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎదురు చూసే రోజులు పోయాయని, ఇక నుంచి ప్రజల సమక్షంలోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వనపర్తి నియోజకవర్గ గ్రామాలైన పెద్దమునుగల్‌ఛేడ్, కన్మనూర్, బలీదుపల్లి, మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లికి చెందిన 10 మంది లబ్ధిదారులకు చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాల కోసం నాయకులు, అధికారుల చుట్టూ తిరిగాల్సి వచ్చేదన్నారు. ఈనెల 28 నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను గ్రామాల్లో అధికారులు స్వీకరిస్తారని తెలిపారు. ఇందుకోసం ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈసారి మంజూరయ్యే చెక్కులను నేరుగా లబ్ధిదారుల వద్దకే వెళ్లి అందజేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఘన్సీరాం, బ్రహ్మంగౌడ్, డీటీ నర్ర శ్రీనివాస్, ఎంపీటీసీలు శకుంతల, గణేష్, భీమన్నయాదవ్, దశరథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతునాయక్, శేఖర్‌రెడ్డి, మనోహర్ తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి మంత్రికి ఘన సన్మానం



మంత్రి దామోదర రాజనర్సింహకు శాలువాతో సత్కరించి స్వాగతం పలుకుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులై తొలిసారిగా బుధవారం పట్టణానికి వచ్చిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం చేశారు. మంత్రి పార్టీ కార్యాలయానికి రాక సందర్భంగా టపాసులు కాల్చారు. అనంతరం మంత్రిని కార్యాలయంలో పలువురు నాయకులు పూలబొకెలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), వాకిటి శ్రీహరి (మక్తల్), పర్ణికారెడ్డి (నారాయణపేట)తోపాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు వినోద్‌కుమార్, ఎన్పీ వెంకటేశ్, సురేందర్ రెడ్డి, సీజే బెనహర్, జహీర్ అఖ్తర్, వసంత, సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న మంత్రిని పలువురు అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేయాలని తెలంగాణ నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహకు బుధవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ పేపర్ లీక్ వ్యవహారంపై న్యాయ విచారణ చేయాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి వెంటనే 20వేలకు పైగా ఖాళీలను భార్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, గోపికృష్ణ, రమేష్ సాగర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత



కుట్టుమిషన్ శిక్షణలో మహిళలు

- శిక్షణతో పాటు ఉచితంగా కుట్టుమిషన్ల అందజేత

కోయిల్‌కొండ: మహిళలకు జీవనోపాధి కల్పించడం కోసం మండలంలోని గార్లపహాడ్‌లో 'యునైటెడ్ వే' సహకారంతో రైస్ స్వచ్ఛంద సంస్థ 30మంది మహిళలకు అక్టోబర్ 3 నుంచి జనవరి 3వ తేదీ వరకు 90రోజులుగా ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, తెలంగాణలో శిక్షణ ఇవ్వడం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో విద్యా, ఆరోగ్యం, వ్యవసాయం, జీవనోపాధి కొరకు శిక్షణ, సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ఆర్థికంగా ఎదగాలి..



గ్రామీణ స్థాయిలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఈ సంస్థ యొక్క ధ్యేయం. కుట్టుమిషన్ శిక్షకురాలిచే 90రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, రైస్ సంస్థ సభ్యుడు

అన్ని వర్గాలకు మేలు చేసేలా..



సంస్థ ద్వారా విద్య, వైద్యం, ఆరోగ్యం, మహిళా సాధికారికత, వ్యవసాయ రంగాల్లో చాలా కార్యక్రమాలను చేపట్టాం. అందులో భాగంగానే గార్లపహాడ్‌లో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నాం.

– నరేష్, రైస్ స్వచ్ఛంద సంస్థ కోశాధికారి

ఘనంగా భీమరాయ ఆంజనేయ రథోత్సవం

మహమ్మదాబాద్: మండలంలోని చౌదర్‌పల్లిలో భీమరాయ ఆంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున 4గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాల భక్తులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మాలల చైతన్య సమితి 8వ ఆవిర్భావ వేడుకలను వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మూలె కేశవులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. న్యూ బస్టాండ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ భవనంలో కేక్ కట్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మందకృష్ణమాదిగకు మాట ఇచ్చి మాలల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. దేశ వ్యాప్తంగా ఎస్సీల ప్రస్తుత జనాభా దామాషా ప్రకారం 20 శాతం రిజర్వేషన్ శాతానికి పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాందాస్, రామకృష్ణ, లక్ష్మయ్య, శివశంకర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

జడ్చర్ల టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలని జనత రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడు జహంగీర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఫకీర్‌నగర్‌లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా మానివేద్దామని, కాలుష్య కారకాలైన వస్తువులను వాడవద్దని పిలుపునిచ్చారు. భావి తరాలకు మంచి ప్రకృతిని అందించేందుకు ఇప్పటి నుంచే పర్యావరణం గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం చేయమంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వలంటీర్లు వనమాల, మాధవి, శోభ, సురేష్ పాల్గొన్నారు.

కందులు క్వింటాల్ రూ.9వేలు

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం కందులకు అత్యధిక ధర వచ్చింది. క్వింటాల్ గరిష్టంగా రూ.9,009, కనిష్టంగా రూ.5,100 ధర లభించింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7వేలు ఉండగా క్వింటాల్‌పై రూ.2 వేలు పైచిలుకు ధర లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డు చరిత్రలో ఇంత ధర దక్కలేదని వ్యాపార వర్గాలు తెలిపాయి. వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ.7,981, కనిష్టంగా రూ.5,649 ధర దక్కింది. ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటాల్ గరిష్టంగా రూ.3,219, కనిష్టంగా రూ.2,003, హంసరకానికి గరిష్టంగా రూ.2,190, కనిష్టంగా రూ.1,827, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,267, కనిష్టంగా రూ.2,130, పత్తి గరిష్టంగా రూ.6,749, కనిష్టంగా రూ.4,220, పెబ్బర్లు రూ.5,455, పొద్దు తిరుగుడు రూ.3501 ధరలు లభించాయి.

ఆస్తి తగాదాలు: తల్లి, చెల్లిపై దాడి

మహమ్మదాబాద్: కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల కారణంగా తల్లి, చెల్లిని కొట్టిన ఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్న వార్వాల్‌తండాకు చెందిన మానిక్యబాయికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. తన కుమారులకు ఆస్తి సమానంగా పంచి ఇచ్చింది. తల్లి తన పెద్దకూతురుతో కలిసి పెద్ద కుమారుని ఇంట్లో ఉంటున్నది. ఇదే క్రమంలో తల్లిని అక్కను చూడటానికి చిన్న కూతురు బుధవారం ఇంటికి వచ్చింది. గమనించిన రమేష్ ఆస్తితగాదాలు దృష్టిలో ఉంచుకుని ఇంట్లో ఎందుకు ఉన్నారంటూ తల్లి, చెల్లిని చితకబాదాడు. వారి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓవర్‌లోడ్‌తో కాలుతున్న పరికరాలు

- మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైన ఏర్పాటులో నిర్లక్ష్యం
- ప్రతి రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం



రాజాపూర్‌లో ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తున్న సిబ్బంది

రాజాపూర్: విద్యుత్ శాఖ అలసత్వం కారణంగా మండల కేంద్రంలో ఓవర్‌లోడ్‌తో ప్రతి రోజు సమస్య తలెత్తుతుంది. దీని మూలంగా గ్రామంలోని ప్రజల ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో కొందరి ఇళ్లల్లో ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోవడంతో యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెల కరెంట్ బిల్లులు మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. మండలం కేంద్రంలో కేవలం ఇళ్ల బిల్లులు ప్రతి నెల రూ.6 లక్షలపైగా వసూలు అవుతున్నా అధికారులు, సిబ్బంది నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. ప్రస్తుతం 5 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. పెరుగుతున్న వినియోగదారులు కొత్త ఇళ్ల నిర్మాణం కారణంగా కొత్త కనెక్షన్‌లు ఇవ్వడంతో ఓవర్‌లోడ్ అవుతుంది. ఉన్న ఈ సమస్యను సర్పంచ్ బచ్చిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మండల కేంద్రంలో మొత్తం ఓవర్‌లోడ్ కారణంగా మార్చి నెలలో అదనంగా మరో 3 ట్రాన్స్‌ఫార్మలను మంజూరు చేశారు. కాని పనులు చేపట్టి సమస్య పరిష్కరించాల్సిన అధికారుల నిర్లక్ష్యం వాటిని ఏర్పాటు చేయకపోవడంతో సమస్య మరింత జఠిలమవుతుంది. వీటి కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యల తలెత్తి ప్రతి రోజు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

ఇబ్బందులు పడుతున్నాం..



ప్రతి రోజు కరెంట్ పోతుంది. దీని మూలంగా ఏ పని చేసుకోలేకపోతున్నాం. ఎలక్ట్రానిక్ పనులు చేసే నాకు కరెంట్ పోతూ వస్తుండటం ఇబ్బందిగా ఉంది. అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఉన్నతాధికారులకు ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– తఫీబాబా, రాజాపూర్

వారం రోజుల్లో పూర్తి చేయిస్తాం..

ఓవర్‌లోడ్ సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారం రోజుల్లో అదనంగా 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. రెండు, మూడు రోజులు సెలవులు, మొన్నటి వరకు ఎన్నికల్ కోడ్ ఉన్నందుకు ఆలస్యమైంది.

– సుజాత, ఏఈ, రాజాపూర్

బైక్ చోరీ

మహమ్మదాబాద్: ఇంటి వద్ద నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేశాయిపల్లికి చెందిన అంగడి నాగరాజు అదే గ్రామానికి చెందిన గాజుల కేశవులు ఇంటి వద్ద బుధవారం ఉదయం తన బైక్‌ను నిలిపి వెళ్లాడు. తిరిగి రాత్రి 9గంటల సమయంలో గ్రామానికి వచ్చాడు. వచ్చి చూసే సరికి బైకు కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.